# సృజనశీలురకు కళాభివందనాలు !

## (25 అక్టోబర్ "అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం" సందర్భంగా)

కళాకారుడు అంటే జీవితాన్ని కళకు అర్పించిన మహామనీషి. పుట్టుకతోనే కొందరు సృజనశీల కళాకారులుగా ప్రకటితం అవుతారు. సృజన ప్రదర్శన ఓ అద్భుత కళ. మన నిత్య జీవితంలో ఎందరో కళాకారులు మన చరిత్రను, సంప్రదాయ కళలను సుసంపన్నం చేస్తూ చూపరులకు వీక్షణ, వీనుల విందులను వడ్డిస్తున్నారు. పెయింటర్స్, సంగీతకారులు, నాట్యకారులు, శిల్పులు, ఫోటోగ్రాఫర్లు, గాయకులు, రచయితలు, నటులు, డిజిటల్ కళాకారులు లాంటి ప్రత్యేక వర్గానికి చెందిన కళాకారులు తమ జీవితాలను కళలకు అంకితం చేసి ప్రపంచ మానవాళి మహోన్నత మన్ననలు పొందుతున్నారు. ప్రపంచానికి అందాలను అద్దే విలక్షణ నైపుణ్య ఆస్తులు మన కళాకారులు. గతాన్ని వర్తమానానికి అనుసంధానం చేసే వీరులు. వాస్తవాలను తవ్వి తీసే నేర్పరులు. సంస్కృతి వారసత్వాలను రేపటి తరానికి అప్పగించే నిస్వార్థ సేవకులు. గత చరిత్రను మన కళ్ల ముందుంచే ధీరులు. వివిధ వర్గాల ప్రజలను ఏకం చేసే శక్తివంతులు. అనేక అవలక్షణాల కలికాలంలో కళాకారులు మాత్రమే మనకు మనశ్శాంతిని ప్రసాదించే మహానుభావులుగా కళాకారులు వెలకట్టలేని సేవలను అందిస్తున్నారు, తమ తర్వాత తరాన్ని కూడా తయారు చేస్తున్నారు.

అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం:

కళకు భాషా భేదాలు లేవు. సరిహద్దులు వాటిని వేరు చేయలేవు. పవిత్ర కళకు జీవితాలను అర్పించి, కఠోర శ్రమ చేస్తూ, కళలో మెలకువలకు రంగులు అద్దుతూ, చూపరుల మదిలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమిస్తున్న ప్రపంచ స్థాయి కళాకారులు ఎందరో. అలాంటి అత్యుత్తమ కళాకారుల జాబితాలో ప్రముఖులు ప్రపంచ ప్రఖ్యాత పబ్లో పికాసో. ఆయన ఒక పెయింటర్, ఒక శిల్పి, ఒక సిరామిసిస్ట్, ఓ కవి, ఒక నాటక రచయితగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి ప్రపంచ మన్ననలు పొందడం మనకు తెలుసు. అలాంటి ప్రపంచ ప్రఖ్యాత బహుముఖ కళాకారుడి జన్మదినం 25 అక్టోబర్ 1881ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 25 అక్టోబర్ రోజు "అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ డే)" పాటించడం 2004 నుంచి ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా మన చుట్టు ఉన్న కళాకారులను గౌరవించడం, ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పేద కళాకారులకు చేయూత ఇవ్వడం, విద్యాలయాల్లో కళల గూర్చి పోటీలు నిర్వహించడం, ఒక మంచి పెయింటింగ్‌ను కొని ఇంట్లో అమర్చడం, కళలకు సంబంధించిన తరగతులను నిర్వహించడం, ఆర్ట్ గ్యాలరీని సందర్శించడం, పిల్లలకు కాళ్ల పట్ల ఆసక్తిని జాగృతం చేయడం, సంగీత వాయిద్యాల గూర్చి తెలుసుకోవడం లాంటి అనేక కార్యక్రమాలను చేయవచ్చు.

ఎందరో కళాకారులు – అందరికీ వందనాలు:

ప్రతి ఒక్కరిలో నిగూఢంగా ఓ కళ దాగి ఉంటుంది. దానిని గుర్తించి, నిద్ర లేపి, సాధన చేయడం ప్రారంభం చేయాలి. కళా ప్రదర్శన ఓ పవిత్ర కార్యంగా భావించబడుతున్నది. రేపటి తరానికి నేటి కళలను బదిలీ చేయవలసిన కనీస కర్తవ్యం మన మీద ఉన్నది. మన పిల్లల ఆసక్తిని గమనించి ఏదో ఒక కళను నేర్పించే ప్రయత్నాలను నేడే మొదలు పెడదాం. కళాకారులు ఒక అద్భుత సృజనశీలురు అని, వినూత్న ప్రయోగాల ఆద్యులని పూజ్య భావంతో గౌరవిద్దాం. భారత దేశానికి చెందిన రవి వర్మ, ఎం ఎఫ్ హుసేన్, రవీంద్రనాథ్ ఠాగూర్, నళిని, ఎస్ హెచ్ రాజా, ఎం ఎస్ సుబ్బలక్ష్మి, లతామంగేష్కర్ లాంటి ఎందరో ప్రఖ్యాత కళాకారులు మన వారసత్వ సంపదను సుసంపన్నం చేసారు, వారి శిష్యులు అవే కళ్లకు డిజిటల్ వెలుగులు అద్దుతున్నారు. మన ప్రాంతానికి చెందిన కళాకారులకు చేయూత గొడుగులు పడదాం, వారి కళ్లకు పోషకులుగా వ్యవహరిద్దాం. ఎందరో కళంకాలు, అందరికీ సవినయ వందనాలు.

–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సీఓపీ 10 బ్యూరో ఉపాధ్యక్ష పదవికి మరోసారి ఎన్నికైన భారత్..

## నిజాయితీతో కూడిన క్రీడలపై దేశ నిబద్ధతకు నిదర్శనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:అంతర్జాతీయ క్రీడల్లో... డోపింగ్ నిరోధక ఒప్పందానికి సంబంధించి పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో జరిగిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ)10వ సమావేశంలో భారత్ చురుగ్గా పాల్గొంది. అక్టోబర్ 20 నుంచి 22 వరకు జరిగిన ఈ సమావేశం కన్వెన్షన్ 20వ వార్షికోత్సవాన్ని గుర్తుచేసింది. క్రీడల్లో నైతికతను ప్రోత్సహించడం, డోపింగ్‌ను నిర్మూలించడంలో నిబద్ధత కలిగిన ప్రపంచవ్యాప్త చట్టబద్ధమైన అంతర్జాతీయ ఒప్పందం ఇదే.

భారత ప్రతినిధి బృందంలో క్రీడల కార్యదర్శి శ్రీ హరి రంజన్ రావు, డీజీ శ్రీ అనంత్ కుమార్, జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ పాల్గొంది. వీరు 190కి పైగా సభ్యదేశాల ప్రతినిధులతో పాటు ఆఫ్రికన్ యూనియన్, ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ , ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ, ఇతర అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో చర్చలు నిర్వహించారు.

సమావేశం సందర్భంగా 2025?27 కాలానికి ఆసియా పసిఫిక్ (గ్రూప్4) బ్యూరో ఉపాధ్యక్ష పదవికి భారత్ మళ్లీ ఎన్నికైంది. కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్10 బ్యూరో అధ్యక్ష పదవికి అజర్‌బైజాన్ ఎన్నికైంది. బ్రెజిల్, జాంబియా, సౌదీ అరేబియా తమ ప్రాంతీయ సమూహాలకు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యాయి.

డోపింగ్ నిరోధక సమావేశం ప్రయాణాన్ని ప్రదర్శించే ఇంటరాక్టివ్ బోర్డులను అందించడం ద్వారా భారత్ సీఓపీ 10 సమావేశం నిర్వహణకు తనవంతు సాయాన్ని అందించింది.

500 మందికి పైగా వివిధ దేశ ప్రభుత్వాల ప్రతినిధులు, డోపింగ్ నిరోధక సంస్థలు, యునెస్కో శాశ్వత ప్రతినిధుల బృందాలు ఈ సమావేశానికి హాజరయ్యాయి. కన్వెన్షన్ ప్రకారం పాలన, సమ్మతిని బలోపేతం చేయడం, క్రీడల్లో డోపింగ్ నిర్మూలన నిధికి ఆర్థిక సహాయం అందించడం, జన్యుపరమైన మోసాలు, సంప్రదాయ ఔషధ విధానాలు, క్రీడల్లో నైతిక అంశాల వంటి కొత్త సవాళ్లను ఎదుర్కోవడంపై చర్చలు కొనసాగాయి.

సీఓపీ10 బ్యూరో, ఆమోద కమిటీ నివేదికలో సంస్థాగత సమన్వయం, వ్యూహాత్మక సమాచారం, విభాగాల మధ్య సమగ్రతపై ప్రధానంగా దృష్టి సారించారు.. విద్యా సంబంధిత ప్రాజెక్టులలో సమన్వయం, ప్రాచుర్యాన్ని పెంపొందించేందుకు భారత్ కొన్ని సవరణలను ప్రతిపాదించింది. ముఖ్యంగా, క్రీడల ద్వారా విలువలు అంశాలపై కొత్త విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా యువత, క్రీడా సంస్థలు, సమాజంలో క్రీడా విలువలు, నైతికత, నిజాయితీని పాదుకొల్పడం వంటి లక్ష్యాలను కలిగి ఉన్నాయి.

సీఓపీ10 ఫలితాలు కన్వెన్షన్ పాలన, ప్రభావాన్ని మెరుగుపరచేందుకు కొనసాగుతున్న సంస్కరణ ప్రక్రియకు తోడ్పడతాయి. ఈ సమావేశం క్రీడల్లో నిజాయితీ, న్యాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర పార్టీల సమష్టి నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ముగిసింది.

# శీతాకాలంలో చలిగాలుల నుంచి నిరాశ్రయులు, ప్రమాదం పొంచి ఉన్న ప్రజల రక్షణకు చర్యలు చేపట్టండి

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:దేశంలో చలిగాలుల దృష్ట్యా.. నివాసం, వనరుల లేమితో ప్రమాదానికి గురయ్యే అవకాశమున్న వారికి, ముఖ్యంగా నవజాత శిశువులు, పిల్లలు, పేదలు, వృద్ధులు, ఇళ్లు లేనివారు, నిరాశ్రయులు, యాచకుల రక్షణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని, సహాయక చర్యలను అమలు చేయాలని 19 రాష్ట్ర ప్రభుత్వాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలన యంత్రాంగాలను భారత జాతీయ మానవ హక్కుల కమిషన్ కోరింది. వాతావరణ మార్పుల కారణంగా శీతోష్ణస్థితి నమూనాలో మార్పులు మానవ హక్కులను ప్రభావితం చేస్తున్నాయన్న కమిషన్.. తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ప్రభావితులయ్యే దుర్బలురైన ప్రజల రక్షణలో తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. వారి హక్కులకూ గౌరవం, రక్షణ ఉన్నాయన్న భరోసానిచ్చింది.

2019 – 2023 మధ్య 'భారత్‌లో ప్రమాద మరణాలు, ఆత్మహత్యలు' పేరుతో జాతీయ నేర నమోదుల సంస్థ (ఎన్సీఆర్బీ) ప్రకటించిన నివేదికను ప్రస్తావిస్తూ.. చలి గాలుల వల్ల దేశంలో మొత్తం 3,639 మంది మరణించినట్టు కమిషన్ పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన యంత్రాంగాలకు అందించిన సమాచారంలో.. చలిగాలుల ప్రభావాన్ని తగ్గించడం కోసం జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్డీఎంఏ) మార్గదర్శకాలను కమిషన్ సూచించింది. సంబంధిత అధికారులను అప్రమత్తులను చేయాలని కమిషన్ కోరింది. అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి, చలి గాలుల ప్రతికూల ప్రభావం నుంచి ప్రమాదానికి గురికాగల ప్రజలను రక్షించడానికి తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులు నివేదికలను అందించాలని కోరింది.

# దేశంలోని సృజనాత్మక మేధావులను "గ్రీన్ హైడ్రోజన్ మిషన్" కోసం లోగో రూపొందించే విజేతకు రూ. 1,00,000 నగదు బహుమతి!

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:దేశంలో హరిత హైడ్రోజన్ పర్యావరణ వ్యవస్థను స్థాపించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అందించడమే లక్ష్యంగా నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమం వేగంగా ఎదుగుతున్న రంగంలోని అవకాశాలు, సవాళ్లకు సమగ్రంగా స్పందించే విధానాన్ని ప్రోత్సహిస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థలో కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం, శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, హరిత హైడ్రోజన్ రంగంలో సాంకేతికత, మార్కెట్ నాయకత్వాన్ని పొందేందుకు ఈ మిషన్ వీలు కల్పిస్తుంది.

ప్రపంచ స్థాయిలో హరిత హైడ్రోజన్ మిషన్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ.. జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ లక్ష్యాన్ని సాధించడానికి పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ సమగ్ర విధానాన్ని అవలంబించింది.. ఈ మిషన్ కోసం లోగో డిజైన్ పోటీలో పాల్గొనేందుకు దేశ పౌరులందరినీ వయస్సుతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తుంది. దీని ద్వారా పౌరుల సృజనాత్మకతను, ఆశయాలను ఈ మిషన్ లక్ష్యాలతో అనుసంధానించనుంది.. హరిత హైడ్రోజన్, దాని ఉత్పత్తుల ఉత్పత్తి, వినియోగం, ఎగుమతుల కోసం దేశాన్ని ప్రపంచ హబ్‌గా మార్చాలనే మిషన్ లక్ష్యాన్ని లోగో డిజైన్ ప్రతిబింబించాలి. ఉక్కు, రవాణా, ఎరువులు, నౌకాయానం, పెట్రోకెమికల్స్ వంటి బహుళ రంగాల్లో స్వావలంబన, పెట్టుబడి అవకాశాలు, హరిత గ్రీన్ హైడ్రోజన్ వినియోగాన్ని కూడా లోగో ప్రతిబింబించాలి.

జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ లోగో డిజైన్ పోటలో పాల్గొనేవారు.. లోగోను జేపీఈజీ, పీఎన్ జీ, లేదా పీడీఎఫ్ ఫార్మాట్‌లో మాత్రమే పంపించాలి. లోగో అధిక రిజల్యూషన్‌లో కనీసం 300 డీపీఐతో ఉండాలి. లోగో పరిమాణం 15సెంటిమీటర్లు చీ 20సెంటిమీటర్లు ఉండాలి. సృజనాత్మకత, వాస్తవికత, కూర్పు, సాంకేతిక నైపుణ్యం, సరళత, కళాత్మక విలువ, దృశ్య ప్రభావం, మిషన్ కు అనుగుణ్యత వంటి అంశాల ఆధారంగా లోగోలను పునర్పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖలోని అంతర్గత కమిటీ పరిశీలిస్తుంది. ఈ పోటీలో గెలిచిన ప్రధాన విజేతకు రూ. 1,00,000/ – నగదు బహుమతి, మంత్రిత్వశాఖ మిషన్ డైరెక్టర్ ద్వారా ప్రశంసా పత్రం అందించనున్నారు. పది మంది రన్నరప్‌లకు ఒక్కొక్కరికి రూ. 5000 చొప్పున బహుమతి ఇవ్వనున్నారు. ప్రధాన విజేతకు న్యూ ఢిల్లీకి వెళ్ళి రావడానికి డొమెస్టిక్ ఎకానమీ క్లాస్ విమాన ప్రయాణ ఖర్చులు తిరిగి చెల్లించనున్నారు.

# రసాయన సంబంధ ప్రమాదాలు: శిక్షణ మాడ్యూళ్లను విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య కార్యదర్శి

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:రసాయనికంగా అత్యవసర స్థితులు ఇటు ప్రజారోగ్యానికి, అటు పర్యావరణ సంరక్షణకే కాక సామాజిక స్థిరత్వానికి కూడా సరికొత్త ముప్పుల్ని తెచ్చిపెడతాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని జాతీయ స్థాయిలో సముచిత సన్నద్ధత చర్యలనూ, శీఘ్రంగా ప్రతిస్పందించగల యంత్రాంగాలనూ బలపరుచుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది. వేగంగా పురోగమిస్తున్న ప్రస్తుత పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థలో, ఈ విధమైన అత్యవసర స్థితుల్ని ఎదుర్కొని పరిష్కరించేందుకు తగిన తాజా వ్యూహాన్ని రూపొందించుకొని, సిద్ధంగా ఉండడం అత్యంత కీలకంగా మారింది.

రసాయనికంగా ఆకస్మిక ఆపద స్థితులు తలెత్తితే వెనువెంటనే చేపట్టాల్సిన ప్రజారోగ్య సంరక్షణ చర్యలకు సంబంధించిన శిక్షణ మాడ్యూళ్లను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ఈ రోజు న్యూఢిల్లీలోని నిర్మాణ్ భవన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో విడుదల చేశారు. ఇది, దీనికి సంబంధించిన సన్నద్ధతను మరింతగా పెంచే దిశలో ఓ ముఖ్య నిర్ణయమని చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో వివిధ మంత్రిత్వ శాఖలు, జాతీయ ఏజెన్సీలు, ప్రయివేటు రంగం, పారిశ్రామిక, విద్య బోధన రంగాలకు చెందిన నిపుణులు పాలుపంచుకున్నారు.

రసాయనిక అత్యవసర స్థితులు తలెత్తిన కాలంలో ప్రజారోగ్య నిర్వహణ అంశంపై మూడు విశేష శిక్షణ మాడ్యూళ్లను కేంద్ర ప్రభుత్వంలోని ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ)లు రూపొందించాయి. దీనికోసం అవి జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) సహకారంతో పాటు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ ఇండియా) నుంచి సాంకేతిక సహకారాన్ని పొందాయి.

రసాయనిక ఘటనలు చోటుచేసుకొన్నప్పుడు సమయానికి తగ్గట్టుగా, ప్రభావశీల నిర్వహణ చర్యల్ని తీసుకోవడానికి అవసరమైన జ్ఞానాన్నీ, ప్రావీణ్యాలనూ, ఆయా కార్యక్రమాల్లో ఉపయోగించాల్సిన సాధనాలనూ ప్రజారోగ్య వృత్తినిపుణులకూ, ఆరోగ్యసంరక్షణ కార్యకర్తలకూ, అత్యవసర స్థితిలో రంగంలోకి దిగి సేవలందించాల్సిన సంబంధిత వర్గాలకూ, విధాన రూపకర్తలకూ అందించడమే ఈ మాడ్యూళ్ల ఉద్దేశం. అంతర్జాతీయ ఆరోగ్య నియమనిబంధనల (ఐహెచ్ఆర్ 2005)లో భాగంగా, రసాయనిక అత్యవసర స్థితుల నిర్వహణను పటిష్ఠపరచడం జాతీయ ఆరోగ్య భద్రతతో పాటు అంతర్జాతీయ ఆరోగ్య భద్రత పరంగా ముఖ్య పాత్రను పోషించే కీలక సామర్థ్యాలకు కూడా తోడ్పడేదే కానుంది.

ఈ మాడ్యూల్ పరిచయ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఎన్‌డీఎంఏ, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలూ, కేంద్రీయ సంస్థలూ, విద్య బోధన రంగం, భారత్‌లోని ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యాలయ ప్రతినిధులతో పాటు ఇతర ముఖ్య భాగస్వామ్య సంస్థల అధికారులు పాల్గొన్నారు. "స్వయంసమృద్ధితో పాటు సుదృఢ దేశ" నిర్మాణానికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# నిర్దిష్ట లక్ష్యాలను సాధిస్తూ పోవడమే జీవన సాఫల్యత

– లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్, రచయిత



న్యూఢిల్లీ, అక్టోబర్ 24:స్వల్ప కాలిక, మధ్యస్థ, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్ణయించుకొని విజయాలు సాధిస్తూ ముందుకు సాగడమే అసలైన జీవన సాఫల్యత అని ప్రముఖ రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ రోజు కొత్తపల్లి సెయింట్ జార్జి హైస్కూలు ఆవరణలో లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ రసాయనశాస్త్ర వారోత్యవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రసాయనశాస్త్రం ఒక మిస్టరీ కాదని, రసాయన చర్యలతో ఆటలు ఆడుకోవాలని, అణు నమూనాలతో లోతైన అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. మన చుట్టు జరుగుతున్న పలు రసాయన ప్రక్రియలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి వైజ్ఞానిక శాస్త్ర అంచులను చేరాలని చెప్పారు. నిత్య జీవితంలో రసాయన శాస్త్ర దృగ్విషయాలను శోధించి ఆకలింపు చేసుకోవాలని అన్నారు. సరళ అణువుల నిర్మాణాలను త్రిమితీయ నమూనాగా అర్థం చేసుకోవాలని అన్నారు. పరమాణువుల లోతులను, అణువుల అమరికను ఆకలింపు చేసుకోవాలన్నారు. పలు అణువుల నమూనాలతో శాస్త్ర విజ్ఞానాన్ని బోధించారు. సభాధ్యక్షత వహించిన స్కూల్ చైర్మన్ ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్య వరకు అత్యంత క్రమశిక్షణతో చదివి రేపటి సమాజానికి దారి దీపంగా నిలవాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రసాయనశాస్త్ర పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

# మాగంటి సునీతను ఆదరించండి.. కారు గుర్తుకు ఓటేయ్యండి : ఎమ్మెల్యే మాధవరం



హైదరాబాద్, అక్టోబర్ 24: కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను ఆదరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీలో ఇంటింటికి ప్రచారంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బాబురావులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నరగంలో, జూబ్లీహిల్స్‌లో జరిగిన అభివృద్ధిని, పేదలకు అందిన సంక్షేమ పథకాలు ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలందరి తెలుసని, కాంగ్రెస్ పాలకులకు బుద్ధిరావలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రతి ఓటరు తప్పకుండా కారు గుర్తుకు ఓటేసి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతాగోపినాథ్‌కు భారీ మెజార్టీని అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

# రైల్వే లైన్ భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు చెల్లించాలి

ఖమ్మం, అక్టోబర్ 24:డోర్నకల్ భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల్లో వ్యవసాయ భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులందరికీ మార్కెట్ రేటు ప్రకారం డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరికి కారేపల్లి భూ నిర్వాసితులంతా కలిసి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రైల్వే లైన్ డబ్లింగ్ భూ నిర్వాసితులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పాల్గొని భూ సేకరణ నిబంధనలను వెల్లడించారు. భూ నిర్వాసితులు ఇచ్చిన విన్నపాలను కూడా ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. ఈ గ్రామ సభలో పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ.. సింగరేణి రెవెన్యూ గ్రామం నాన్ ఏజెన్సీ కాబట్టి వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.91 లక్షల చొప్పున, ఇండ్లు కోల్పోయిన వారికి గజం ఒక్కింటికి రూ.20 వేల చొప్పున మార్కెట్ రేటు చెల్లించాలని భూ నిర్వాసితులు కోరారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారం మార్కెట్ వ్యాల్యూ చూసినా కారేపల్లికి చెందిన భవనాసి గణేష్ సర్వే నెంబర్ 200/2/1/1 లో రూ.91,48,000గా చూపుతోందని, గుండెబోయిన కోటేశ్వరరావుకు చెందిన సర్వే నంబర్ 77ఆ/2 లో రూ.11,25,000 గా నమోదయిందన్నారు. ఇదే గ్రామానికి చెందిన ముండ్ల సుధాకర్ సర్వే నంబర్ 52అ/6 లో రూ.11,25,000 గా భూ భారతిలో మార్కెట్ వాల్యూ నమోదై ఉన్నదని పేర్కొన్నారు. ఈ ముగ్గురు రైతుల పేర్లు భూ సేకరణ ఫైనల్ గెజిట్ జాబితాలో ఉన్నాయి కాబట్టి ఈ మార్కెట్ వ్యాల్యూలను కూడా పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని భూ నిర్వాసితులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను వేడుకున్నారు.

# ఉప్పల్‌లో మిట్ట మధ్యాహ్నం చైన్ స్నాచింగ్..

హైదరాబాద్, అక్టోబర్ 24: హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు కరువయ్యాయి. దోపిడీ దొంగలు యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. పట్టపగలే దోపిడీలకు పాల్పడుతూ.. నగర ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నారు.

తాజాగా ఉప్పల్ పరిధిలో మిట్ట మధ్యాహ్నం చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఉప్పల్ సెవెన్ హిల్స్ కాలనీలో రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి 4 తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోవడానికి దొంగ ప్రయత్నించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. బాధితురాలి కేకలు విని, స్థానికులు దొంగను వెంబడించి పట్టుకున్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని తాండూరులో ర్యాలీ

ఆదిలాబాద్, అక్టోబర్ 24:ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాండూరు మండల ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కల్పన, ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పెరిగిన డీజిల్, డ్రైవర్ వేతనాలను చెల్లిస్తూ ఫైనాన్సు కిస్తీలు కడుతూ తాండూర్ మండలంలో ఇసుక రవాణా చేస్తు జీవిస్తున్నామని తెలిపారు.

నెలలో కేవలం 8 నుంచి 10 ట్రిప్పులు కొడుతూ చాలిచాలని ఆదాయంతో ట్రాక్టర్లను నడిపిస్తున్నామన్నారు. ఇటీవల తెలంగాణా ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లకు తాము నెన్నెల మండలం ఖర్జి వాగు నుంచి తాండూర్ మండలానికి ఇసుక రవాణా చేసున్నామని వివరించారు. తాండూర్ మండలానికి చెందిన కొందరు నాయకులు తమ స్వార్థం కోసం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రెబ్బెన మండలానికి చెందిన ఇసుకను తెప్పిస్తు కిరాయి , వేతనం తక్కువగా ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో ట్రాక్టర్ యజమానులకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇండ్లకు సరఫరా చేసున్న కిరాయిని తాండూర్ మండల ప్రజల కోసము మరికొంత తగ్గించడానికి సిద్దంగా ఉన్నామని పేర్కొన్నారు. తాండూరు మండలానికి ఇసుకను తీసుకురావడానికి తమకు అనుమతి ఇవ్వాలని కోరారు. రెబ్బెన మండలానికి చెందిన ట్రాక్టర్లను తాండూర్ మండలములోకి రాకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండలం ట్రాక్టర్ యజమానులు భాస్కర్ గౌడ్, మామిడాల రాజేశం, పేరా శంకర్, పూదరి అనిల్ కుమార్, ఇడిదినేని లక్ష్మణ్, ముదం అనిల్, సప్ప రాకేష్, చీర్ల అరుణ్, బోయిన కిరణ్, మద్దిబోయిన రంజిత్ కుమార్, మండల ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# ఏ సవాలునైనా తిప్పికొట్టేందుకు ఆపరేషన్ సిందూర్

## ప్రపంచానికి అందించింది..నావికాదళ కమాండర్ల సమావేశంలో రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:"ఆపరేషన్ సిందూర్ భారతదేశ సంకల్ప శక్తికి, సామర్థ్యానికి చిహ్నం. ఏ సవాలునైనా తిప్పికొట్టేందుకు మనం సర్వసన్నద్ధంగా ఉన్నామన్న సందేశాన్ని ప్రపంచానికిచ్చింది" అని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2025 అక్టోబర్ 23న న్యూఢిల్లీలో జరిగిన నావికా దళ కమాండర్ల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. పాకిస్థాన్‌ను ఓడరేవుకు, ఆ దేశ తీరానికే పరిమితమయ్యే పరిస్థితి కల్పించిన భారత నావికాదళాన్ని ప్రశంసించారు. ఈ ఆపరేషన్ సందర్భంగా మన నావికాదళ కార్యసన్నద్ధత, నైపుణ్య సామర్థ్యాలు, శక్తులను ప్రపంచమంతా చూసిందని ఆయన వ్యాఖ్యానించారు. హిందూ మహాసముద్ర ప్రాంతం (ఐఓఆర్)లో భారత నావికాదళ ఉనికి 'మిత్ర దేశాలకు ఊరట' అని, 'ఈ ప్రాంతాన్ని అస్థిరపరచాలనుకునే వారికి వ్యాకులత' అని అన్నారు.

"సమకాలీన భౌగోళిక రాజకీయాలకు హిందూ మహాసముద్ర ప్రాంతం కేంద్రంగా మారింది. ఇది ఇకపై అస్సలు నిష్క్రియాత్మకం కాదు.. పోటీకి, సహకారానికి ఈ ప్రాంతం నిలయమైంది. భారత నావికాదళం తన బహుముఖ సామర్థ్యాల ద్వారా ఈ ప్రాంతంలో నాయకత్వ పాత్ర పోషించింది. గత ఆరు నెలల్లో మన నౌకలు, జలాంతర్గాములు, నావికాదళ ఎయిర్ క్రాఫ్టులను మునుపెన్నడూ లేని స్థాయిలో మోహరించాం. అంతేకాకుండా దాదాపు 1.2 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు, 5.6 బిలియన్ డాలర్ల వరకు వాణిజ్య విలువ కలిగిన దాదాపు 335 వాణిజ్య నౌకలకు మన నావికాదళం సురక్షిత మార్గాన్ని అందించింది. నేడు అంతర్జాతీయ నౌకా ఆర్థిక వ్యవస్థలో విశ్వసనీయ, సమర్థ భాగస్వామిగా భారత్ నిలిచిందనేందుకు ఇదే నిదర్శనం" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

"స్వావలంబనతో కూడిన నావికాదళమే.. ఆత్మవిశ్వాసం గల, శక్తిమంతమైన దేశానికి పునాది" అని రక్షణ మంత్రి అభివర్ణించారు. దేశీయ పరికరాల ద్వారా సామర్థ్యాలను పెంచుకుని, ఆత్మనిర్భర భారత పతాకధారిగా ఆవిర్భవించిన మన నావికాదళాన్ని ఆయన ప్రశంసించారు. "గత పదేళ్లలో నావికాదళ పరికరాల కొనుగోలు ఒప్పందాల్లో దాదాపు 67 శాతం భారతీయ పరిశ్రమలతోనే జరిగాయి. మనం ఇకపై దిగుమతులపైనే ఆధారపడి లేమని ఇది రుజువు చేస్తోంది. మనం సొంత ప్రతిభపై, ఎంఎస్ఎంఈలూ అంకుర సంస్థల సామర్థ్యాలపై ఆధారపడుతున్నాం. ప్రస్తుతం ఐడెక్స్, టీడీఎఫ్, స్ప్రింట్, మేకిన్ ఇండియా కింద 194 ఆవిష్కరణ, దేశీయీకరణ ప్రాజెక్టులపై భారత నావికాదళం పనిచేస్తోంది. ఈ కార్యక్రమాలు సాంకేతిక స్వావలంబనతో నావికాదళాన్ని తీర్చిదిద్దడమే కాకుండా.. ప్రైవేటు పరిశ్రమలు, యువ ఆవిష్కర్తలను కూడా ఈ మిషన్‌లో భాగం చేశాయి" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

ప్రస్తుత యుద్ధాలు సాంకేతికత, నిఘా ఆధారితమైనవిగా పేర్కొంటూ.. రక్షణ, దేశీయ ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఆత్మనిర్భరతపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపుతోందని రక్షణ మంత్రి పునరుద్ఘాటించారు. "నావికా సంసిద్ధత ఇకపై ఓడలు లేదా జలాంతర్గాములకే పరిమితం కాదు. సాంకేతి ప్రాతిపదిక గల, నెట్‌వర్క్ కేంద్రీకృత, స్వయంప్రతిపత్త వ్యవస్థలపై ఇది ఆధారపడి ఉంటుంది. ప్రత్యర్థుల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నుంచి మనల్ని మనం రక్షించుకోవాలి. ఈ రంగాల్లో మన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. మనకు శక్తి సామర్థ్యాలున్నాయి. సొంతగడ్డపైనే మనం పరికరాలను తయారు చేసుకుంటున్నాం" అని ఆయన అన్నారు.

ఆత్మనిర్భర భారత్ ద్వారా భారత నావికాదళం రక్షణపరమైన ఉత్పత్తిలో నిమగ్నమై ఉండటమే కాకుండా, దేశ పురోగతికి కూడా గణనీయంగా దోహదపడుతోందని రక్షణ మంత్రి ప్రశంసించారు. "నేడు మన నావికాదళం దేశ స్వావలంబన, ఆవిష్కరణ, పారిశ్రామికాభివృద్ధిలో మార్గదర్శకంగా నిలిచింది. ప్రతి ఓడ, జలాంతర్గామి అభివృద్ధితో ఓ కొత్త ఉద్యోగావకాశం కలుగుతోంది. ప్రతి ఇంజిన్ ఓ కొత్త నైపుణ్యాన్ని అందిస్తోంది. ప్రతీ దేశీయ వ్యవస్థతో భారత ఆధీనత తగ్గుతోంది. 75 శాతానికి పైగా దేశీయ భాగాలే ఉన్న ప్రాజెక్ట్ 17ఏ నౌకలతో ఎండీఎల్, జీఆర్ఎస్ఈ వంటి నౌకా నిర్మాణ కేంద్రాల్లో దాదాపు 1.27 లక్షల ఉద్యోగావకాశాలు ఏర్పడ్డాయి. నావికా దళ ప్రతీ ప్రాజెక్టు భద్రతతోపాటు ఆర్థిక వ్యవస్థతో, యువత ఉపాధితో ముడిపడి ఉందనేందుకు ఇది రుజువు" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఎంఎస్ఎంఈలు, చిన్న షిప్‌యార్డులతో భారత నావికాదళ సహకారం గణనీయంగా పెరుగుతోందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఇటీవల యార్డ్ క్రాఫ్టుల నిర్మాణం కోసం దాదాపు రూ.315 కోట్ల విలువైన కాంట్రాక్టులను ఇచ్చినట్టు తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' దార్శనికతతో వేసిన భారీ ముందడుగు ఇది అన్నారు. "తన వైమానిక రంగంలో స్వావలంబన దిశగా నావికాదళం అనేక ఆవిష్కరణలు చేసింది. మల్టీరోల్ నౌకా పర్యవేక్షణ ఎయిర్ క్రాఫ్ట్, బహుళార్థక ఉపయోగాలున్న హెలికాప్టర్లు, రెండు ఇంజిన్లున్న డెక్ ఫైటర్లు, నావికా దళ నౌకలపై ఉన్న మానవ రహిత వైమానిక వ్యవస్థల వంటి ప్రాజెక్టులు మన దేశీయ విమానయాన పరిశ్రమకు కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయి. ఇది కీలకమైన సామర్థ్య అంతరాలను భర్తీ చేయడమే కాకుండా, స్వావలంబననూ బలోపేతం చేస్తుంది" అని ఆయన అన్నారు.

ప్రస్తుత యుద్ధాలను ఎదుర్కోవాలంటే వ్యూహాల రూపకల్పనతోపాటు అత్యాధునిక పరికరాలను సమకూర్చుకోవడానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. "కేవలం పరికరాలు, యుద్ధనౌకలతో ఏ దేశమూ యుద్ధంలో గెలవలేదు. సాంకేతికత మనకో ఆధిక్యాన్నిస్తుంది. కానీ భౌగోళిక వ్యూహాలు, యుక్తి, సమయస్ఫూర్తి, మన నిర్ణయాలను ఎల్లప్పుడూ ఓ వ్యూహాత్మక చట్రంగా పరిగణించాలి. నౌకల పరిమాణం, ఆధునికీకరణ ముఖ్యమైనవే. కానీ, వేదికలను వ్యూహాత్మకంగా ఉపయోగించడం కూడా అంతే కీలకం. ప్రణాళికలో చురుకుదనం, అనుకూలత చాలా కీలకం" ఆయన పేర్కొన్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంతోపాటు నౌకాదళ వ్యూహం, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడం ఆవశ్యకమని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. "మూడు రంగాల్లో మనం కలిసి పనిచేయాలి: సమర్థత, వ్యక్తులు, భాగస్వామ్యాలు. సామర్థ్యం అంటే సాంకేతికత, శక్తి. వ్యక్తులంటే నావికులు, వారి కుటుంబాలు. భాగస్వామ్యాలు అంటే పరిశ్రమలు, విద్యాసంస్థలు, అంతర్జాతీయ సహకారం. ఈ మూడూ కలిస్తే మన నావికా దళం మరింత విశ్వసనీయమైనదిగా, శక్తిమంతమైనదిగా ఆవిర్భవిస్తుంది" అని రక్షణ మంత్రి అన్నారు.

త్రివిధ దళాల ప్రధానాధికారి జనరల్ అనిల్ చౌహాన్, నావికా దళాధిపతి అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, రక్షణ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ సింగ్, డీడీఆర్డీ కార్యదర్శి, డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్, నౌకాదళ కమాండర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ నాయకత్వం, అధికారులతో సన్నిహిత సంభాషణకు, ప్రస్తుత భౌగోళిక-వ్యూహాత్మక వాతావరణంలో వివిధ సవాళ్ల పరిష్కారం పట్ల భారత నావికాదళ దృక్పథాన్ని మెరుగుపరిచేందుకు ఓ వేదికగా ఈ సమావేశం ఉపయోగపడుతుంది.

పశ్చిమ, తూర్పు సముద్ర తీరాల్లో కార్యాచరణ సంసిద్ధతను నావికాదళ అత్యున్నత నాయకత్వం సమీక్షిస్తోంది. మేకిన్ ఇండియా పథకం కింద దేశీయీకరణ, ఆవిష్కరణలకు ఊతమిస్తోంది. ప్రభుత్వ మహాసాగర్ (అన్ని ప్రాంతాల భద్రత కోసం పరస్పర, సమగ్ర పురోగతి) లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ.. హిందూ మహాసముద్ర ప్రాంతం, ఇండో- పసిఫిక్‌లో భారత నావికాదళాన్ని ప్రాధాన్య భద్రతా భాగస్వామిగా నిలుపుతోంది.

# మన శత్రువులు ఎప్పుడూ నిద్రించరు.. సాయుధ దళాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సంసిద్ధతతో ఉండాలి: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:"ఆపరేషన్ సిందూర్‌తో మన సాయుధ దళాలు పాకిస్థాన్‌కు తీవ్ర స్థాయిలో హెచ్చరికను ఇచ్చినందున ఆ దేశం ఇకమీదట భారత్‌పై ఏదైనా దుస్సాహసానికి పాల్పడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంది" అని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2025 అక్టోబర్ 23న రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో సైనిక విందులో (బరాఖానా) సైనికులతో మాట్లాడుతూ ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఆపరేషన్ ముగియలేదని కేవలం ఆగిపోయిందని పునరుద్ఘాటించిన ఆయన.. పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే మరింత తీవ్రస్థాయిలో స్పందించనున్నట్లు ఆయన హెచ్చరించారు. "మన పైలట్లు పాకిస్థాన్‌కు భారతదేశ సామర్థ్యాన్ని పరిచయం చేశారు. అవకాశం ఇస్తే వారు మన వాస్తవ బలాన్ని తెలియజేస్తారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

దేశ శత్రువులు ఎప్పుడూ నిద్రించరని తెలియజేసిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్.. సాయుధ దళాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సంసిద్ధతతో ఉండాలని కోరారు. దీనితో పాటు శత్రువుల చర్యలకు తగిన ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు.

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన స్వావలంబన దేశంగా తయారుచేయాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ దార్శనికతను సాకారం చేయడంలో సాయుధ దళాలు పోషించే పాత్రను రక్షణ మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. "మన సైనికులు సరిహద్దులను రక్షించేవారు మాత్రమే కాదు.. జాతి నిర్మాణానికి మార్గదర్శకులు. ఈ శతాబ్దం మనది.. భవిష్యత్తు మనది. స్వావలంబన దిశగా మనం సాధించిన పురోగతితో మన సైన్యం నిస్సందేహంగా ప్రపంచంలోనే అత్యుత్తమంగా మారుతుందన్న నమ్మకం నాకు ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం నిబద్ధతతో ఉన్నట్లు తెలిపిన ఆయన.. రక్షణ సంసిద్ధతను మరింత పెంచేందుకు సరిహద్దు వెంబడి అభివృద్ధి కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

సైనిక విందులో ప్రతి ఒక్కరిని సమానంగా చూస్తారని, భారత సంస్కృతి, నాగరికత, విలువలకు ఈ విందు ఓ చిహ్నమని రక్షణ మంత్రి చెప్పారు. "మన దళాలు వివిధ మతాలు, కులాలు, భాషలు, ప్రాంతాల వారికి నిలయంగా ఉన్నాయి. ఇక్కడ చాలా వైవిధ్యత ఉంటుంది. సైనిక విందులో ఒక భోజన పళ్లేన్ని ఇది ప్రతిబింబిస్తోంది. ఇదే ఇతర అన్ని విందుల కంటే దీనిని గొప్పదిగా చేస్తోంది" అని ఆయన అన్నారు.

సైనిక విందుకు ముందు రక్షణ మంత్రి జైసల్మేర్‌లో ఒక ప్రత్యేకమైన కాక్టి-కమ్-బొటానికల్ గార్డెన్ 'శౌర్యవన్'ను ప్రారంభించారు. భారత సైన్యం చేపట్టిన 'శౌర్యవన్' కార్యక్రమం ద్వారా థార్ ఎడారిని.. దృఢత్వం, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలకు ప్రతీకగా నిలిచే ఒక శక్తిమంతమైన ఒయాసిస్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది.

'భారత్ రణభూమి దర్శన్' కార్యక్రమంలో 'శౌర్య గాంతవ్య' అయిన జైసల్మేర్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద అమరవీరులకు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నివాళులర్పించారు. స్మారక చిహ్నానికి సంబంధించిన మ్యూజియంలో భద్రపరిచిన యుద్ధ ట్రోఫీలు, కళాఖండాల విస్తృతమైన సేకరణ గురించి ఆయనకు వివరించారు. వివిధ సంక్లిష్ట పరిస్థితుల్లో భారత సైన్యం చూపించిన పరాక్రమానికి శాశ్వత సాక్ష్యాలుగా ఇవి ఉన్నాయి. స్మారక చిహ్నం వద్ద హోలోగ్రాఫిక్ లైట్, సౌండ్ కార్యక్రమ ప్రారంభ ప్రదర్శనను ఆయన వీక్షించారు. ఈ అత్యాధునిక సాంకేతికత వల్ల ప్రధాన గమ్యస్థానంగా ఈ స్మారక చిహ్నానికి ఉన్న స్థానం బలోపేతం అవుతుంది.

ఈ కార్యక్రమంలో భారత సైన్యం చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, రక్షణ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, ఆర్మీ వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్, ఆర్మీ కమాండర్లందరూ, భారత సైన్యంలోని ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

2025 అక్టోబర్ 24న రక్షణ మంత్రి సరిహద్దు ప్రాంతాలను సందర్శించి.. దక్షిణ కమాండ్ నిర్వహించే 'సామర్థ్య ప్రదర్శన విన్యాసాలను' వీక్షించనున్నారు. జైసల్మేర్‌లో జరిగే ఆర్మీ కమాండర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు.

# సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర : ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ, అక్టోబర్ 24:: సీసీఐ కేంద్రాల్లో పత్తికి కనీస మద్దతు ధర లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలోని కాటన్ మిల్లులో (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ వ్యాపారులను ప్రోత్సాహించవద్దని, బయ్యర్ మాత్రమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని కోరారు. రైతులు తమ పత్తిని సీసీఐ కేంద్రాలకు తెచ్చే ముందు తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉండేలా చూసుకోవాలన్నారు.

సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించాలంటే తప్పనిసరిగా కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. సీసీఐ కేంద్రాల్లో రైతులకు సరిపడ వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ్మ, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్ది సుక్కయ్య, నాయకులు బెజవాడ సైదులు, రెడ్డిపల్లి సాగర్, ముత్యాల లింగయ్య. గద్దపాటి దానయ్య, పాపట్ల వెంకట్ రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# భారత్, జర్మనీ భాగస్వామ్యం బలోపేతం-శ్రీ పీయూష్ గోయల్ భేటీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్, 23 అక్టోబర్ 2025న బెర్లిన్‌లో జర్మన్ ఫెడరల్ ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి శ్రీమతి కేథరీనా రిచేతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ఆగస్టు ఏడవ తేదీన జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్ణయం మేరకు వారి సమావేశం జరిగింది. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, హరిత ఇంధనం, నైపుణ్య రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించడంపై వారు ప్రధానంగా చర్చించారు. జర్మనీ ఫెడరల్ చాన్సెలరీలో ఆర్థిక, ద్రవ్య విధాన సలహాదారు, జర్మనీ జీ7, జీ 20 షెర్పా డాక్టర్ లెవిన్ హోలేతో కూడా శ్రీ గోయల్ సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే అవకాశాలపై వారు చర్చించారు.

అనంతరం శ్రీ గోయల్ భారత రాయబార కార్యాలయంలో జర్మన్ మిట్టెల్ స్థాండ్ కంపెనీల సీఈఓలు, నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు భారత్ లో వ్యాపారం చేయడానికి, ఇప్పటికే ఉన్న పెట్టుబడులను విస్తరించడానికి తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. భారతదేశం అందిస్తున్న అవకాశాలను, పెట్టుబడులను, వ్యాపారాలను సులభతరం చేయడానికి భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను శ్రీ గోయల్ వారికి వివరించారు. చర్చల సందర్భంగా ఆవిష్కరణ, సుస్థిరత, ఆధునిక తయారీ రంగాలలో సమన్వయం, పరస్పర వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేసే అవకాశాలను పరిశీలించారు.

ఈ పర్యటనలో భాగంగా, శ్రీ గోయల్ లక్సెంబర్గ్ ఉప ప్రధానమంత్రి, విదేశీ వ్యవహారాలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీ జావియర్ బెట్టెల్ ను కలవనున్నారు. ఇన్ఫినియన్ టెక్నాలజీస్, షాఫ్లర్ గ్రూప్, రెంక్, హెరెన్‌క్నెక్ట్ ఏజీ, ఎనర్‌ట్రాగ్ ఎస్ఈ, మెర్సిడెస్ బెంజ్ గ్రూప్ వంటి ప్రముఖ జర్మన్ కంపెనీల సీఈఓలతో విడివిడిగా సమావేశమై చర్చలు జరపనున్నారు.

అక్టోబర్ 24న కూడా శ్రీ గోయల్ పర్యటన కొనసాగుతుంది. ఆయన బెర్లిన్ గ్లోబల్ డైలాగ్ ప్యానెల్ చర్చలో పాల్గొంటారు. జర్మనీ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో మరిన్ని సమావేశాలు జరుపుతారు.

# రౌడీ షీటర్లకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ కౌన్సెలింగ్



నల్లగొండ, అక్టోబర్ 24 : ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లాలోని రౌడీ షీటర్స్ దాదాపు 40 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా మెలగాలన్నారు. జిల్లా పరిధిలో రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్ల కార్యకలాపాలు పోలీసుల నిఘాలో ఉన్నాయని, చట్ట వ్యతిరేక కార్యలాపాలు ఆర్థిక, భూ సెటిల్‌మెంట్లు వంటివి చేస్తూ సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారైన చట్టం నుంచి తప్పించుకోలేరని, ఇప్పటికే పలువురికి శిక్షలు విధించడం జరిగిందన్నారు.

జిల్లాలో ప్రతి ఒక్కరి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ (పీడీ యాక్ట్) నమోదు చేయడానికి వెనుకాడబోమన్నారు. సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీస్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తమ పాత పద్ధతులను వదులుకుని సత్ప్రవర్తనతో మంచిగా మారి ఎలాంటి నేరాలు చేయకుండా సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు.

ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవ రావు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్.ఐ హరిబాబు, టూ టౌన్ ఎస్ఐ సైదులు, రూరల్ ఎస్ఐ సైదాబాబు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్త దానం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులతో పాటు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని దాదాపు 150 యూనిట్లు రక్తదానం చేయడం జరిగిందన్నారు.

అదే విధంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఆన్‌లైన్ వ్యాసరచన పోటీ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ పోటీల్లో 6వ తరగతి నుండి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులు తమ వ్యాసాలను ఈ నెల 30వ తేదీ లోపు సమర్పించాలన్నారు. ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా స్థాయిలో 1వ, 2వ, 3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

# దళారులను నమ్మి పత్తి రైతులు మోసపోవద్దు : ఎమ్మెల్యే బాలునాయక్



నల్గొండ, అక్టోబర్ 24: దళారులకు పత్తిని అమ్మి రైతులు మోసపోవద్దని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిల్కమర్రి స్టేజి శివ గణేష్ కాటన్ మిల్లు వద్ద సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తేమ తక్కువ ఉండి, చెత్తాచెదారం లేని నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ.8,110 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నాయిని జమున మాధవరెడ్డి, వైస్ చైర్మన్ తగుళ్ల సర్వయ్య, పిఏసిఎస్ చైర్మన్ దుదిపాల వేణుధర్ రెడ్డి, పీఏపల్లి మండలాధ్యక్షుడు ఎల్లయ్య యాదవ్, మార్కెట్ డైరెక్టర్ సుధాకర్, వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, సీసీఐ అధికారులు అవినాష్, కిరణ్, కాటన్ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసునూరు యుగేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు రేఖ శ్రీధర్ రెడ్డి, వంగాల ప్రతాప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# కర్నూలు ఘోర బస్సు ప్రమాదంపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రగాఢ సంతాపం

అమరావతి, అక్టోబర్ 24:కర్నూలు ఘోర బస్సు ప్రమాదంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతో కలిచి వేసిందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో 19 మంది సజీవ దహనం అత్యంత విషాదకరమని అన్నారు.

ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందేలా చూడాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.కావేరి ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో కర్నూలు శివారు చిన్నటేకూరు సమీపంలో ఓ బైకును ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బస్సు మొత్తానికి విస్తరించడంతో భారీగా అగ్నికీలలు చెలరేగాయి. చూస్తుండగానే బస్సు మొత్తం అగ్నికి ఆహుతైంది. అంతా నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో బస్సులో ఉన్న 42 మందిలో 19 మంది సజీవదహనమయ్యారు.




# 'మేకిన్ ఇండియా' స్ఫూర్తితో విస్తరిస్తున్న, స్థిరత్వం సాధిస్తున్న పారిశ్రామిక రంగంతో పాటు

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ రచించిన కథనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. 'మేకిన్ ఇండియా' స్ఫూర్తితో విస్తరిస్తున్న, స్థిరత్వం సాధిస్తున్న పారిశ్రామిక రంగంతో పాటు ఆధునికీకరణ, యాంత్రీకరణ, రద్దీగా ఉండే తూర్పు-పశ్చిమ వాణిజ్య మార్గంతో సహా పోర్టుల డిజిటలీకరణకు చేపడుతున్న ప్రయత్నాలు దేశానికి ప్రత్యేక ప్రయోజనాన్ని ఎలా అందిస్తున్నదీ శ్రీ సర్బానంద సోనోవాల్ ఈ కథనంలో పంచుకున్నారు. "ఇది కచ్చితంగా చదవాల్సిన కథనం. 'మేకిన్ ఇండియా' అందిస్తున్న ప్రోత్సాహంతో విస్తరిస్తున్న, స్థిరత్వం సాధిస్తున్న పారిశ్రామిక రంగంతో పాటుగా ఆధునికీకరణ, యాంత్రీకరణ, రద్దీగా ఉండే తూర్పు - పశ్చిమ వాణిజ్య మార్గంతో సహా పోర్టుల డిజిటలీకరణ ప్రయత్నాలు దేశానికి ప్రత్యేకమైన ప్రయోజనాన్ని ఎలా అందిస్తున్నదీ కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ వివరించారు.

భారతీయ నౌకా నిర్మాణం, నౌకా వాణిజ్య వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ప్రకటించిన 8 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఓ సాధారణమైన బడ్జెట్ లాంటిది కాదని, అది ఆశయ సాధనకు సూచన అని ఆయన వివరించారు."

# కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చకనే బీఆర్ఎస్‌లో చేరికలు : మాజీ మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, అక్టోబర్ 24:కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ వార్డు మెంబర్లు చింత అశోక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బరిగెల ఇసాక్, మాజీ సొసైటీ డైరెక్టర్ మొలుగూరి బాబు, కొత్తూరు జాన్సన్, చింత రఘులతో పాటు పలువురు కార్యకర్తలు శుక్రవారం పున్నేల్ క్రాస్ వద్ద దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరిన వారంతా కలిసి మెలిసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతుంది. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పంపుల మోహన్, మండల ఇంచార్జ్ పోలేపల్లి రామ్మూర్తి, మాజీ సర్పంచులు పల్లగొండ సురేష్, ఎస్.కె ఉస్మాన్ అలీ, సీనియర్ నాయకులు తీగల లక్ష్మణ్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి కాటబోయిన అశోక్, గడ్డం రఘువంశీ గౌడ్, దుప్పెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో తొలిదశ జీవ వైవిధ్య పరిరక్షణ సాధికారతకు రూ.1.36 కోట్లు విడుదల చేసిన జాతీయ జీవ వైవిధ్య సంస్థ

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:జీవ వైవిధ్య ప్రయోజనాలను న్యాయంగా, సమానంగా పంచటానికి.. పరిరక్షణ, సుస్థిర వినియోగానికి తన ప్రాధాన్యతను తెలుపుతూ, జాతీయ జీవ వైవిధ్య సంస్థ (ఎన్ బీఏ) రూ.1.36 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో వాణిజ్య వినియోగం ద్వారా పొందిన ప్రయోజనాలను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ లోని స్థానికులకు అందిస్తుంది.

మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ జీవ వైవిధ్య బోర్డుల ద్వారా ఈ ఆర్థిక సాయాన్ని మూడు జీవ వైవిధ్య నిర్వహణ కమిటీలు.. మహారాష్ట్రలోని సతారా జిల్లా, ఫల్తాన్ తాలూకాలోని సఖర్వాడి గ్రామం, పూణే జిల్లా హవేలీ తాలూకాలోని కుంజిర్వాడి గ్రామం, ఉత్తరప్రదేశ్ లోని ఎలా జిల్లా, కాస్ గంజ్ ప్రాంతానికి అందిస్తారు. ఆయా ప్రాంతాల్లోని ప్రతి బీఎంసీకి రూ.45.50 లక్షలు అందుతాయి. దీని ద్వారా సమానత్వం, సుస్థిరత, పరిరక్షణకు ప్రభుత్వ ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతుంది.

ఒక వాణిజ్య సంస్థ ఫ్రక్టో-ఒలిగోశాకరైడ్స్ ఉత్పత్తులను తయారు చేయడానికి నేల, పారిశ్రామిక వ్యర్థ జల నమూనాల నుంచి సేకరించిన సూక్ష్మజీవులను ఉపయోగించినందుకు చెల్లించిన వాస్తవ వనరుల లభ్యత, ప్రయోజనాల పంపిణీ (ఏబీఎస్) చెల్లింపులను, విడుదల చేసిన నిధులు సూచిస్తాయి. జీవ వైవిధ్య చట్టం 2002లోని సెక్షన్ 44, సంబంధిత రాష్ట్ర జీవ వైవిధ్య నియమాలలోని కార్యకలాపాలకు ఈ నిధులు ఉపయోగపడతాయి.

భారతదేశపు గొప్ప జీవ వైవిధ్య వారసత్వానికి కీలక సంరక్షకులుగా నిలిచే స్థానిక సంఘాలను గుర్తించి, వాటికి తగిన ప్రయోజనాలను అందించేందుకు ఎన్ బీఏ క్రియాశీలక పాత్రను ఈ ఆర్థిక వ్యూహం స్పష్టం చేస్తుంది.

జాతీయ జీవ వైవిధ్య సంస్థతో వచ్చిన ప్రయోజనాలను తిరిగి స్థానికులకే అందించటం ద్వారా జీవ వైవిధ్య పరిరక్షణ, సమాజాభివృద్ధి కలిసి భారత సమగ్ర పాలనా విధానం బలోపేతమవుతుంది. ఐక్యరాజ్యసమితి జీవ వైవిధ్య సదస్సు (సీబీడీ) కాప్-15లో ఆమోదించిన కున్మింగ్ మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్ కు అనుగుణంగా నవీకరించిన ఎన్ బీఎస్ఏపీ 2024-2030 జాతీయ జీవ వైవిధ్య లక్ష్యం - 13ని ఇది నెరవేరుస్తుంది.

## పవిత్రమైన కార్తీక మాసంలో ప్రత్యేక డీలక్స్ బస్సులు

అమరావతి, అక్టోబర్ 24: దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఎంతో పవిత్రమైన కార్తీక మాసం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ లోని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడిపిస్తున్నట్లు ఇన్చార్జి డిపో మేనేజర్ పడాల సైదులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమరావతి (అమరలింగేశ్వర స్వామి దేవాలయం), భీమవరం (సోమేశ్వర స్వామి దేవాలయం), పాలకొల్లు (క్షీర లింగేశ్వర స్వామి దేవాలయం) ద్రాక్షారామం( భీమేశ్వర స్వామి దేవాలయం), సామర్లకోట ( భీమలింగేశ్వర స్వామి దేవాలయం) లను ఒకే రోజు దర్శించుకునే అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా తిరుగు ప్రయాణంలో విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం ప్రత్యేకంగా కల్పించడం జరిగిందన్నారు. పెద్దలకు రూ.2200, పిల్లలకు రూ.1400 చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ఈనెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలను దర్శించి పరమ శివుని ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే తెలంగాణలోనివపుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు కూడా ప్రత్యేకంగా భక్తుల కోరిక మేరకు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. బుకింగ్ కోసం 9949026631, 9848847419,9666599890, 9441340163నంబర్ లను సంప్రదించాలని ఆయన కోరారు.

# సింగరేణి పాఠశాలలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలి..

### -సంస్థ కార్పొరేట్ ఎడ్యుకేషనల్ జనరల్ మేనేజర్ (కార్పొరేట్ ) వెంకటాచారి



గోదావరిఖని, అక్టోబర్ 24:ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసుపోకుండా సింగరేణి పాఠశాలల్లో ఈ విద్య సంవత్సరం పదో తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎడ్యుకేషనల్ జనరల్ మేనేజర్ (కార్పొరేట్ )వెంకటాచారి కోరారు. ఇటీవలనే పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన గోదావరిఖని పట్టణంలోని సింగరేణి పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అడ్మిషన్లు ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించి అనంతరం వారితో సమావేశమై మాట్లాడారు.

పదో తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సింగరేణి సంస్థ విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సూచనల మేరకు సింగరేణి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆయన కోరారు. మొదటిసారిగా పాఠశాలను సందర్శించిన జీఎంను పాఠశాల కరస్పాండెంట్ పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి పాఠశాల హెడ్మాస్టర్ సంతోష్ కుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి 'వికసిత భారత్ - 2047' స్వప్నాన్ని సాకారం చేసేందుకు యువత శక్తి కీలకం- కిషన్ రెడ్డి




హైదరాబాద్, అక్టోబర్ 24:హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో ఈ రోజు జరిగిన 17వ రోజ్ గార్ మేళా సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, కొత్తగా ఎంపికైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు.

కొత్తగా నియమితులైన ఉద్యోగులను ఉద్దేశించి మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో 11 లక్షలకుపైగా యువతకు ప్రధాన మంత్రి మోదీ చేతుల మీదుగా నియామక పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలు వికసిత భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించనున్నాయని ఆయన పేర్కొన్నారు.

"ఇది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, దేశ అభివృద్ధిలో అర్థవంతమైన పాత్ర పోషించే అవకాశం" అని ఆయన అన్నారు. యువతను ఉద్యోగదారులుగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ తీసుకున్న చర్యలను గుర్తు చేస్తూ, స్టార్టప్‌లకు అందుతున్న బలాన్ని వివరించారు. "గత 11 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో వ్యవసాయం నుండి సాంకేతిక రంగం వరకు అనేక ఆవిష్కరణలు చోటు చేసుకున్నాయి" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డా. వీనా కుమారి డెర్మల్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సౌతర్న్ రీజియన్ అదనపు డైరెక్టర్ జనరల్ , హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ బసబ్ ముఖోపాధ్యాయ, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ జనరల్ మేనేజర్, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఎస్. ఆర్. వాజ్పే, డివిజన్ కార్పొరేటర్ డా. సురేఖ బీశ్వా మరియు తెలంగాణ సర్కిల్ పోస్ట్ కౌన్సిల్ డైరెక్టర్ సి. ఎం. సంపూర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పోస్టల్ విభాగం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, సిఎస్ఐఆర్-ఐఐసీటి హైదరాబాద్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్నుశాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, విమానాశ్రయ ప్రాధికార సంస్థ, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ వంటి వివిధ శాఖలకు చెందిన సుమారు 80 మంది అభ్యర్థులు నియామక పత్రాలు స్వీకరించారు.

దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో 17వ రోజ్ గార్ మేళా నిర్వహించబడింది. జాతీయ స్థాయిలో, వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన యువతను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్దేశించి ప్రసంగించారు.

## కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం..

నల్గొండ, అక్టోబర్ 24:కట్టంగూర్ మండలంలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి ముద్దయింది. మునుకుంట్ల, కల్మెర, నారెగూడెం, పరడ, అయిటిపాముల, ఈదులూరు, కురుమర్తి, బొల్లెపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు వర్షానికి తడిసిపోయాయి. కల్మెర గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం లోతట్టు ప్రాంతం కావడంతో భారీ వర్షానికి రైతుల ధాన్యం రాసులు నీటిలో కొట్టుకుపోయాయి. కొనుగోలు కేంద్రం పక్కనే ఉన్న వరద కాల్వను ఆ ప్రాంతంలోని రైతులు ధ్వసం చేసి ఆక్రమించడంతో వరద నీరంత కేంద్రంలోకి చేరడంతో ధాన్యం రాసులు నీటిలో మునిగిపోయాయి.

వర్షాలకు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఐకేపీ, పీఏసీఎస్ అధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం తెచ్చి పది రోజులవుతున్నా మ్యాచర్ రావడం లేదనే సాగుతో కాంటాలు వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిచి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కల్మెర పీఏసీఎస్ కేంద్రంలో నిలిచిన వర్షపు నీటిని తాసీల్దార్ పుష్పలత దగ్గరుండి జేసీబీతో కింది ప్రాంతానికి తరలించారు.

**ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి : వనం శ్రీను, రైతు, దుగినవెల్లి**

వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. వారం రోజుల క్రితం ఐదు ఎకరాల ధాన్యాన్ని కల్మెర పీఏసీఎస్ కేంద్రానికి తెచ్చి ప్రతి రోజు ఆరబెడుతున్నాం. కేంద్రాన్ని ప్రారంభించి మ్యాచర్ రావడం లేదని అధికారులు కాంటా వేయడం లేదు. రాత్రి, పగలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నాం. అకాల వర్షానికి సుమారు ఐదు బస్తాల ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

# మహిళా సంఘాలకు.. కొనుగోలు కేంద్రాలు



హైదరాబాద్, అక్టోబర్ 24:కమ్మర్ పల్లి మండలంలోని కోన సమందర్, బషీరాబాద్, కొత్త చెరువు తాండా, ఇనాయత్ నగర్, గ్రామలలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించినట్లు ఐకెపి ఎపిఎం గోపు.కిరణ్ కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా మండలంలోని ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రా లను తాహశీల్దార్ జి. ప్రసాద్, ఏఎంసి చైర్మన్ పాలేపూ నర్సయ్య లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మహిళా సంఘాలకు అధిక సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తేమ శాతం 17 కు మించకుండా మైచ్చుర్ వచ్చిన వరిని మాత్రమే తూకం చేయాలని తెలిపారు. ఏ గ్రేడ్ కు రూ. 2,389,బి గ్రేడ్ కు రూ.2,369 ప్రభుత్వం ధర నిర్ణయించిందని, రైతులు దళారులకు నమ్మి మోసపోవద్దనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న,ఆర్ ఐ శరత్,ఏ ఈ ఓ స్వామి,సిసిలు రవి,పీర్య నాయక్, భాగ్యలక్ష్మి,మహిళా సంఘాల సభ్యులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచీ అన్ని సినిమాహాళ్లలో 'సబ్ కీ యోజన, సబ్ కా వికాస్' అవగాహన చిత్రం నేపథ్యం: ప్రభుత్వ సేవలపై అవగాహన

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ సబ్ కీ యోజన, సబ్ కా వికాస్ పై రెండు నిమిషాల నిడివితో రూపొందించిన ప్రభుత్వ సేవల అవగాహన (పీఎస్ఏ) చిత్రం నేడు- అక్టోబర్ 24 నుంచి నవంబర్ 6, 2025 వరకు దేశవ్యాప్తంగా అన్ని థియేటర్లలో ప్రదర్శిస్తారు. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులందరికీ అందేలా చూడాలన్న ప్రధానమంత్రి లక్ష్యాలకు అనుగుణంగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికా రూపకల్పనలో ప్రజలకు అవగాహన కల్పించటం, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటం ఈ ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రతి పౌరుడి పాత్రను ఈ కార్యక్రమం స్పష్టం చేస్తుంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న రాష్ట్రాల్లో తప్ప, దేశవ్యాప్తంగా అన్ని సినిమా హాళ్లలో ప్రభుత్వ సేవల అవగాహన చిత్రాల ప్రదర్శన మార్గదర్శకాల ప్రకారం ఈ షార్ట్ ఫిల్మ్ ను ప్రదర్శిస్తారు. సినిమా ప్రారంభానికి ముందు, ఇంటర్వెల్ లో చివరి ఐదు నిమిషాల సమయంలో ప్రదర్శిస్తారు.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ (పీపీసీ) 2025-26 కార్యక్రమం అక్టోబర్ 2, 2025న ప్రారంభించారు. ప్రత్యేక గ్రామసభ సమావేశాల ద్వారా, స్థానిక ప్రాధాన్యతలను ప్రతిబింబిస్తూ, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా సాక్ష్యాధారాలతో కూడిన, సమ్మిళిత పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయటానికి పంచాయతీలకు ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ - సబ్ కీ యోజన, సబ్ కా వికాస్ 2018లో ప్రారంభమైనప్పటి నుంచి ముఖ్య కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. గ్రామీణ భారతంలో క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటం, భాగస్వామ్య ప్రణాళికను సంస్థాగతం చేయటం, స్వయం పరిపాలన పునాదులను పటిష్టం చేసేందుకు ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ ప్రకారం 2019-20 నుంచి 18.13 లక్షలకు పైగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (జీపీడీపీ), బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (బీపీడీపీ), జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (డీపీడీపీ)లు అప్ లోడ్ అయ్యాయి. వాటిలో 2025?26 సంవత్సరానికి సంబంధించి 2.52 లక్షల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కూడా ఉన్నాయి.పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ లో భాగంగా రూపొందించిన ప్రభుత్వ సేవల అవగాహన చిత్రాన్ని దేశవ్యాప్తంగా ప్రదర్శించటం ద్వారా, పీఆర్ఐలతో పౌరులు మరింతగా మమేకమై స్థానిక పాలన, గ్రామీణాభివృద్ధిలో చురుగ్గా పాల్గొనేలా చేయాలని మంత్రిత్వ శాఖ భావిస్తోంది.

# మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తేలేదు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



హైదరాబాద్, అక్టోబర్ 24:అంబర్‌పేట నియోజకవర్గ ప్రజల మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని,పలు డివిజన్‌లలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్ ఖార్కానలైన్‌లో గత కొన్ని రోజులుగా మంచినీటిలో పోల్యూషన్ వాటర్ రావడంతో ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బస్తీ అధ్యక్షుడు క్యాస రవికుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కాలేరుకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు.

బస్తీలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బస్తీ సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ ప్రజల సహకారంతో ఐదేండ్లలోనే అంబర్‌పేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని బస్తీ, కాలనీలలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్, రోడ్లను వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి గణేష్ హౌస్ ఓనర్స్ వెల్ఫర్ అసోసియేషన్ ప్రతినిధులు భోగ స్వామి,పాక స్వామి, వి.రమేశ్, గౌట్టాల వినోద్‌చారి,ఆంధ్రప రాజు, చారి,నాగరాజు, వెంకటేశ్, పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ డిజిటల్ కొనుగోళ్లు ప్రారంభం

ఆదిలాబాద్, అక్టోబర్ 24: మార్కెట్ లోపత్తి రైతులకు జరిగే మోసాలకు చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన "కపాస్ కిసాన్" డిజిటల్ కొనుగోళ్లు ఆదిలాబాదులో లాంచనంగా ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఈరోజు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన పత్తి సరకును ఆన్లైన్ మొబైల్ యాప్ ద్వారా శ్రీకారం చుట్టి ప్రయోగత్మకంగా కొనుగోళ్లను ప్రారంభించారు. ప్రతి ఏటా వ్యాపారులు, మధ్య దళారుల చేతిలో పత్తి రైతులు మోసపోతున్న నేపథ్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో "కపాస్ కిసాన్" యాప్ ను తెర పైకి తెచ్చింది.

ఇక తాక్ పట్టి, రసీదులకు చెక్ పెడుతూ రైతుల మొబైల్ ఫోన్లోనే ఓటిపి ద్వారా స్లాట్ బుకింగ్ పత్తి కొనుగోలు చేపట్టేలా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు గావించింది. రైతులకు సంబంధించి 24 అంశాలను పొందుపరిచే విధంగా మొబైల్ ఫోన్లోనే ప్రత్యేక యాప్ ను పొందుపరిచారు. వ్యవసాయ అధికారులు రైతులకు సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు ఈనెల 27 నుండి ప్రారంభమవుతాయని, ప్రయోగాత్మకంగా రైతుల అవగాహన కోసమే ఈరోజు స్మార్ట్ డిజిటల్ పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టినట్టు కలెక్టర్ తెలిపారు. రైతులంతా కపాస్ కిసాన్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 28న ఆందోళన

### -బాపట్ల వైఎస్సార్సీపీ సమన్వయకర్త కోన రఘుపతి




బాపట్ల, అక్టోబర్ 24 : నిరుపేదలకు విద్య వైద్యం కార్పొరేట్ స్థాయిలో అందించే 17 ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం పీపీపీ పద్ధతితో ప్రైవేటీకరణ, రాష్ట్ర రాజధాని నిర్మాణం ప్రభుత్వమే చేపట్టడం ఏమిటని బాపట్ల వైఎస్సార్సీపీ సమన్వయకర్త కోన రఘుపతి ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక రథం బజార్ సెంటర్లో గల నియోజకవర్గ కార్యాలయంలో వైద్య కళాశాల ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 28న ప్రజా ఉద్యమానికి కోన రఘుపతి పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో విద్యార్థులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఈ సందర్భంగా ప్రజా ఉద్యమం పోస్టర్‌ను వైయస్సార్సీపీ నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్మిస్తే పేద విద్యార్థులకు ఉచిత విద్య లభించి డాక్టర్లుగా ప్రజలకు సేవలు అందిస్తారని తెలిపారు. కళాశాల ఏర్పాటుతో నర్సింగ్ కళాశాల పారామెడికల్ కళాశాల కార్పొరేట్ వైద్యం వంటి సౌకర్యాలు వస్తాయన్నారు. తద్వారా విద్యతోపాటు అనేకమంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం మెరుగుపడుతుందన్నారు. ఈ విధానానికి స్వస్తి పలుకుతూ పీపీపీ విధానంతో చంద్రబాబు నాయుడు తన బినామీలకు లబ్ధి చేకూర్చడానికే ఈ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధపడుతున్నారన్నారని తెలిపారు.

పేద విద్యార్థులు అందరూ డాక్టర్లుగా కావాలనే సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో భారీ సంఖ్యలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను యథా విధంగా ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చేజెర్ల నారాయణరెడ్డి, కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలు రెడ్డి, కోనపు రెడ్డి అవినాష్ నాయుడు, జోగి రాజా, తన్నీరు అంకమ్మరావు, సి.కే నాయుడు పాల్గొన్నారు.

# పీయూష్ పాండే మృతి.. ప్రధానమంత్రి సంతాపం

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:వాణిజ్య ప్రకటనలు, కమ్యూనికేషన్ల రంగ దిగ్గజం శ్రీ పీయూష్ పాండే మృతికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సంతాపాన్ని వ్యక్తం చేశారు. శ్రీ పాండే అసాధారణ సృజనాత్మక ప్రతిభనూ, భారతదేశ వాణిజ్య ప్రకటనల రంగానికి ఆయన అందించిన మహత్తర సేవలనూ ప్రధానమంత్రి నిండుమనసుతో ఓ సందేశంలో స్మరించుకొన్నారు.

"పీయూష్ పాండే గారి సృజనాత్మక ప్రజ్ఞ ప్రశంసనీయం. వాణిజ్య ప్రకటనలు, కమ్యూనికేషన్ల జగతికి స్మరణీయ సేవలను అందించారాయన. గత కొన్నేళ్లలో మేం ఇద్దరం చర్చించిన అంశాల్ని నేను చాలా ఆప్యాయంగా నా మదిలో పదిలపరుచుకొంటాను. ఆయన మరణ వార్త తెలిసి, ఎంతో బాధపడ్డాను. ఆయన కుటుంబానికీ, ఆయన అభిమానులకూ నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

# బిఆర్ఎస్ పార్టీ బుడబుక్కల పార్టీ

## -తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కామెంట్స్




హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిఆర్ఎస్ పార్టీ బుడబుక్కల పార్టీ అని, అదో బొందల గడ్డ పార్టీ అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ విమర్శించారు. శుక్రవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ తెలంగాణ కు కేటిఆర్ కు ఏమి సంబంధం?తెలంగాణ ఉద్యమం గురించి కేటిఆర్ కు తెలుసా?కాంగ్రెస్ మంత్రి వర్గం దండుపాళ్యం అని కేటిఆర్ అంటుండుమీ పార్టీనే దొంగల పాళ్యంకేటిఆర్ నాయకుడు అని ప్రజలు ఇంకా గుర్తించట్లేదుమీ కుటుంబం లిక్కర్ దందాలో ఉన్నారు, భూ మాఫియాలో ఉన్నారుమీరు అప్పు చేసిన 8లక్షల కోట్లు మీ దగ్గరే ఉన్నాయిమీ చెల్లి ని ఎందుకు బయటకు పంపారో ముందు చెప్పు అని డిమాండ్ చేసారు. కేటిఆర్ రాజకీయం కోసం చెల్లెలు ని వదులుకుంటారు, కుటుంబాన్ని వదులు కుంటారు హరీష్ రావు నీకు నీ చెల్లెకు మధ్య పంచాయితీ పెట్టిండు అది గుర్తించు కేటిఆర్ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తే మీ పార్టీలో ఒక్కడు మిగలడు2023 లో అధికారంలోకి వచ్చి మళ్ళీ దోచుకోవలని చూశారుకానీ ప్రజలు ఓడగొట్టి ఇంట్లో కూర్చోబెట్టారుఅధికారం వచ్చాక దోచింది ఎంత? దాచింది ఎంత? మీ పంపకాలు ఎంత?తుంగతుర్తి లో ఇసుక దందాలో మీరు ఎంత పంచుకున్నారో చెప్పండిముఖ్యమంత్రి రాజయ్య ను ఎందుకు తొలగించారో నీ అయ్య, నీవు చెప్పలేదు నమ్ముకున్న వాళ్ళను నట్టేట ముంచే అలవాటు ఉందన్నారు.కాంగ్రెస్ 140 ఏండ్ల చరిత్ర కలిగిన పార్టీమీపార్టీ బుడబుక్కల పార్టీ జూబ్లీ హిల్స్ లో కూడా కంటోన్మెంట్ ఎన్నికల లాగ రిపీట్ కాబోతోందిభవిష్యత్తు లో బిఆర్ఎస్ పార్టీ ఉండదని జోస్యం చెప్పారు.

# సీఎంకు ప్రజల సంక్షేమంపై సోయిలేకపోవడం విచారకరం

## -జడ్పీ ఛైర్‌పర్సన్

జగిత్యాల అక్టోబర్ 24: పేదల అభివృద్ధిని, సంక్షేమం కాంక్షించాల్సిన ముఖ్యమంత్రికి ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల కనీసం సోయి లేకపోవడం విచారకరమని జగిత్యాల జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. జగిత్యాల మండలం మోరపల్లి గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడారు.

రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. మొక్కజొన్న కొనుగోలు సమయం వచ్చినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన లేని పాలన సాగుతుందని విమర్శించారు. ఆరుగాలం కష్టపడి పనిచేస్తే ఇవాళ దళారుల దగ్గర రైతు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం రూ. 2,400 మద్దతు ధర ఉంటే రూ. 1,850 అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు . సగటున క్వింటాలుకు రూ. 500 నష్ట పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ఒక్కో రైతుకు 18 క్వింటాళ్ల పరిమితి నిబంధన ఎందుకని ఆమె ప్రశ్నించారు. పండించిన పంట అమ్ముకునేందుకు నిబంధనలు పెట్టడం విచారకరమని అన్నారు. దేశానికి అన్నం పెట్టె రైతన్న ఖ్యాతిని ప్రపంచపటంలో నిలిపిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందని వెల్లడిం చారు.

తెలంగాణ ను రైస్‌బౌల్ గా నిలిపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని వివరించారు. రైతాంగం కోసం రైతు బంధు, 24 గంటల కరెంట్, రైతు బీమాతో పాటు కరోనా కష్ట కాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, రైతులను ఆదుకున్నారని వెల్లడించారు.

# వీకే కోల్ మైన్స్‌లో సమస్యలు పరిష్కరించండి : మల్లికార్జున్‌రావు



ఖమ్మం, అక్టోబర్ 24:వీకే ఓసిలో బొగ్గు వెలికితీత సింగరేణి కార్మికులతోనే తీయించాలని, అదేవిధంగా జీకే ఓసి మూతపడిన తర్వాత జెవిఆర్ ఓసికి డిప్యుటేషన్ పై పంపిన కార్మికులను వెంటనే తిరిగి పేరెంట్ మైన్ వికే ఓసికి తీసుకు రావాలని కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా వీకే ఓసిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఓసి మేనేజర్ మురళిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీకే ఓసిలో పంప్ ఆపరేటర్ యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు పర్మినెంట్ డిసిగ్నేషన్ ఇవ్వాలని, సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో వికే ఓసి పిట్ కార్యదర్శి ఎం ఆర్ కె ప్రసాద్, మెంగన్ రవి, కోటి, ప్రభాకర్, కార్మికులు పాల్గొన్నారు.

# బాకీ కార్డులపై బహిరంగ చర్చకు సిద్ధం

## -కేటీఆర్, హరీష్ రావు కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్




హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బాకీ కార్డుల పై బహిరంగ చర్చకు సిద్ధంపదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల ప్రజా పాలనపై ప్రజల సమక్షంలోనే చర్చిద్దాం.దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలని కేటీఆర్, హరీష్ రావు కు స్ట్రాంగ్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ సవాల్ విసిరారు.శుక్రవారం గాంధి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లడుతూ మీ కుటుంబ సమస్య నే పరిష్కరించుకోలేక పోతున్నారు.మా పార్టీ గురించి మా మంత్రుల గురించి మాట్లాడే అర్హత లేదు.బాకీ కార్డుల పేరుతో హడావిడి చేస్తున్న హరీష్ రావు.... ముందు పదేళ్ల మీ పరిపాలనలో బాకీ పడ్డా హామీల సంగతి మరిచి పోయావా...?అధికారంలో ఉన్నప్పుడు ఏ యూనివర్సిటీ కి వెళ్లలేదు, ఏనాడు ఏ లైబ్రెరీ కి వెళ్లలేదు.ఈనాడు కపట ప్రేమ చూపిస్తున్న హరీష్ రావు... ఆనాడు మంత్రిగా ఉండి కూడా కనీసం నిరుద్యోగులకు అపాయింట్ కూడా ఇవ్వలేదు.అవన్నీ నిరుద్యోగులు మరిచిపోయారని అనుకుంటే.. ..పొరపాటు.అనాడు ఓ నిరుద్యోగ సోదరి ఆత్మహత్య చేసుకుంటే... దానిని కూడా వక్రీకరించిన నీచమైన చరిత్ర మీది.రెండేళ్ల ప్రజాపాలన గురించి మాట్లాడే అర్హత మీకు లేదు.మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగాల నియామకాలపై చిత్తశుద్ధితో పని చేస్తున్నాము.శాఖల వారీగా దాదాపు 58 వేలకు పైగా ఉద్యోగాలు నియామకాలు అందజేశాం.స్వయంగా ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా నియామకాల పత్రాలు అందజేసి నిరుద్యోగుల్లో ధైర్యం నింపాము.స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్సిటీ కి వెళ్లి నిరుద్యోగులతో మాట్లాడి...డిసెంబర్ లో మళ్లీ వస్తానని, చెప్పారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యూనివర్సిటీకి వస్తే..నిరుద్యోగులు తరిమితే దొంగ చాటుగా పారిపోయాడు, మరచిపోయారా...?జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక కోసమే నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారు.స్వయంగా నిరుద్యోగులు కేసీఆర్ పేరు, బీఆర్ఎస్ నేతల పేర్లు రాసి చనిపోయారు, ఇలా స్వార్థ రాజకీయాల కోసం ఎంతో మందిని పొట్టన బెట్టుకున్న నీచమైన చరిత్ర బీఆర్ఎస్ నేతలది.పదేళ్లు అధికారంలో ఉండి, నిరుద్యోగులకు న్యాయం చేయలేని, అసమర్థ పాలన చేసింది కేసీఆర్.జీవో 46 తీసుకొచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వం.రాబోయే నోటిఫికేషన్లలో నిరుద్యోగులతో చర్చించి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.వచ్చే నోటిఫికేషన్లలో ఎలాంటి ఇబ్బందుకు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# నా జీవితాంతం కేసీఆర్‌తోనే ఉంటాను : శ్రీనివాస్ గౌడ్




హైదరాబాద్, అక్టోబర్ 24:జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి భయంతో దిగజారి నీతిమాలిన రాజకీయాలు చేస్తోంది అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అభ్యర్థి నాతో ఎప్పుడు ఫోటో దిగారో, ఎప్పుడు మాట్లాడారో తనకు తెలియదన్నారు. నా జీవితాంతం కేసీఆర్‌తోనే ఉంటానని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

నవీన్ యాదవ్‌కు శ్రీనివాస్ గౌడ్ మద్దతు తెలిపారని సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. ఫాల్త్ మాటలతో కాంగ్రెస్

అధికారంలోకి వచ్చింది. నేను ఉద్యమ సమయం నుంచి కేసీఆర్‌తో ఉన్నాను. నా తండ్రి తెలంగాణ ఉద్యమకారుడు. తెలంగాణ కోసం ఉద్యోగాన్ని వదులుకుని వచ్చాను. ఉద్యోగంలో ఉండి జైలుకి వెళ్ళాను. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నా తమ్ముడిని 40 రోజులు జైల్లో పెట్టారు. నేను ఒకే పార్టీలో ఉన్నాను, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశాను. నా క్యారెక్టర్‌ను దెబ్బతీస్తున్నారు. గెలవడం చేతకాక క్యారెక్టర్ దెబ్బతీస్తున్నారు అని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.

ఫేక్ ప్రచారాలు చేస్తున్న వారిపై మేము అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా చర్యలు తీసుకుంటాము. నాపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేస్తాం. వారిపై రూ. 10 కోట్లకు పరువు నష్టం దావా వేస్తాం. ఏ బుక్ లేదన్న డీజీపీ ఎందుకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. కాంగ్రెస్ వాళ్ళను మాత్రమే డీజీపీ కాపాడుతారా..? అని శ్రీనివాస్ గౌడ్ నిలదీశారు.

సెటిల్‌మెంట్లు చేసిన వాళ్ళను, రేప్ కేసులో ఉన్న వాళ్ళను వెంట తిప్పుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటు. కేసీఆర్ చేసినట్లు బీసీలకు ఎవరూ మేలు చేయలేదు. మీలాగా మేము చెట్టు కొమ్మను నరుక్కోం. కాంగ్రెస్ అఫీషియల్ ఫేస్‌బుక్‌లో నాపై పోస్టు పెట్టారు మీకు సిగ్గు ఉందా..? ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాను జీవితాలతో ఆటలు ఆడవద్దు. మా కుటుంబ సభ్యులను

వేధించినా మేము భయపడలేదు. పార్టీ మారితే కేసులు ఎత్తివేస్తామన్నా పార్టీ మారలేదు అని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# పారిశుద్ధ కార్మికులను సమాజం తక్కువ చూపు చూడకూడదు

## -బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి



యదాద్రి భువనగిరి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పారిశుద్ధ కార్మికులు మున్సిపల్ లో పనిచేసేవారు 25 మందికి నూతన వస్త్రాలు బహకరించడం జరిగింది. ఇది 20 సంవత్సరాల నుంచి నిర్విరామంగా కొనసాగిస్తున్న ప్రక్రియ పారిశుద్ధ కార్మికులను సమాజం తక్కువ చూపు చూస్తున్న సమయంలో మనం ఎంతో దగ్గరికి తీసి వాళ్లకు ధైర్యం చెప్పి వారు వార్డులలో పారిశుధ్య పనులు చేస్తే మన యొక్క పరిసర ప్రాంతాలు నీటుగా ఉంటాయని, వారు అనారోగ్యానికి గురికాకుండా చూసుకోవలసిన బాధ్యత మన సమాజంపై ఉంటదని తెలియజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమం రోటరీ క్లబ్, జననీ ఫౌండేషన్, మా యొక్క తల్లిదండ్రుల చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది పాల్గొన్న వారికి పేరు పేరునా ధన్యవాదాలు

# జాబ్ క్యాలెండర్ కాదు అది జాబ్‌లెస్ క్యాలెండర్

## -జాబులు నింపమంటే జేబులు నింపుకున్నారు: హరీష్ రావు

హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నిరుద్యోగ బాకీ కార్డు విడుదల చేశామని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ కాదు అని, జాబ్‌లెస్ క్యాలెండర్ గా మారిందని చురకలంటించారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీలతో రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మాయ మాటలు చెప్పించారన్నారు. ఇప్పుడు ప్రజలను మోసం చేశారని, ఉద్యోగాల బదులు మద్యం నోటిఫికేషన్లు ఇచ్చారన్నారు. జాబులు నింపమంటే జేబులు నింపుకున్నారన్నారు. నిరుద్యోగ యువత. చేతిలో ఒక అవకాశం ఉందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ను ఓడించాలని పిలుపునిచ్చారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. కమీషన్లు, వసూళ్లు పంపకాల్లో తేడాలు రావడంతో ముఖ్యమంత్రి, మంత్రులు కొట్లాడుకుంటున్నారని ఆరోపణలు చేశారు. ఇవ్వాళ రాష్ట్రంలో ఏం జరుగుతుందో నిరుద్యోగ యువత ఆలోచన చేయాలన్నారు.

# భక్తిగీతాల్ని పంచుకోవాల్సిందిగా పౌరులను కోరిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24:దేశ ప్రజలు ఛఠ్ పర్వదినాన్ని త్వరలో నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా భక్తిభావాన్నీ, సాంస్కృతిక ఐకమత్య భావననూ చాటాలనీ, ఛఠీ మాతకు అంకితమిచ్చిన పాటలను తనతో పంచుకోవాలనీ పౌరులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ‘ఎక్స్’లో ప్రధానమంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ, ఛఠ్‌కు ప్రకృతితో, సంస్కృతితో ప్రగాఢ బంధం ఉందనీ, బీహార్‌తో పాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో ఈ పండగకు సంబంధించిన సన్నాహాలను ఇప్పటికే మొదలుపెట్టారనీ అన్నారు.

“ప్రకృతికీ, సంస్కృతికీ అంకితమైన మహాపర్వం ఛఠ్ త్వరలో రానుంది. బీహార్ సహా దేశమంతటా ఈ పండగకు సన్నాహాల్ని చేపట్టడంలో శ్రద్ధాళువులు ఎంతో భక్తిభావంతో నిమగ్నమయ్యారు. ఛఠీ మాతను ఉద్దేశించి రూపొందే గీతాలు ఈ పవిత్ర సందర్భం గొప్పతనాన్నీ, దివ్యత్వాన్నీ మరింత పెంచుతాయి. మీరు ఛఠ్ పూజకు సంబంధించిన గేయాల్ని నాతో పంచుకోవాల్సిందిగా నేను కోరుతున్నాను. ఆ గేయాలన్నిటినీ నేను రాబోయే కొన్ని రోజుల పాటు దేశ ప్రజలందరితో పంచుకుంటాను.”

# వైద్య విద్యార్థినులకు ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం




నల్గొండ, అక్టోబర్ 24: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన అందుగుల సైదమ్మ, వెంకటయ్య దంపతుల కుమార్తెలు తేజశ్రీ, ప్రవళిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. కాగా ఆర్థిక ఇబ్బందులతో వారి చదువులకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ స్పందించి శుక్రవారం ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ చేతుల మీదుగా రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. మున్ముందు కూడా వారి చదువుకు పూర్తి సహాయ సహకారాలు అందించనున్నట్లు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు దాత భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కిరణ్, మహేశ్ గౌడ్, నరేశ్, సైదులు, లింగస్వామి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి- కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ సీతారాం కోరారు.

హైదరాబాద్, అక్టోబర్ 24:విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ సీతారాం కోరారు. శుక్రవారం మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసమావేశంలో మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు.

విలువైన సమయాన్ని వృధా చేసుకోవద్దని పేర్కొన్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ముందుకు రావాలని వివరించారు. డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేస్తాయని పేర్కొన్నారు. డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడితే మనం ఏం చేస్తున్నామో, తెలియదని పేర్కొన్నారు.



# హైవేను దిగ్బంధించిన ఏనుగు.. 18 గంటలు నిలిచిపోయిన వాహనాలు

తిరువనంతపురం:, అక్టోబర్ 24: ఒక ఏనుగు హైవేను దిగ్బంధించింది. ఒక చెట్టును రోడ్డుకు అడ్డంగా పడేసింది. సుమారు 18 గంటల పాటు ఆ ఏనుగు అక్కడే ఉన్నది. దీంతో వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. స్థానికంగా అలజడి సృష్టించే ‘కబాలి’ ఏనుగు ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అతిరప్పిల్లి–మలక్కప్పర అంతర్రాష్ట్ర రహదారిపైకి వచ్చింది. రోడ్డుకు అడ్డంగా ఒక చెట్టును పడేసి తినసాగింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

కాగా, ఈ సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఆ ఏనుగును అక్కడి నుంచి తరిమేందుకు ప్రయత్నించారు. అయితే వారిపై అది దాడి చేయడంతో తృటిలో తప్పించుకున్నారు. చివరకు సోమవారం ఉదయం 7 గంటలకు ఆ ఏనుగు అడవిలోకి వెళ్లింది. దీంతో 18 గంటలపాటు ఆ రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో వాహనాల్లో చిక్కుకుపోయిన వ్యక్తులు, టూరిస్టులు ఆహారం, నీరు లేక ఇబ్బందులకు గురయ్యారు.

మరోవైపు 2016లో రిలీజ్ అయిన రజనీకాంత్ చిత్రం ‘కబాలి’ పేరును ఈ ఏనుగుకు పెట్టారు.

దాని ప్రవర్తనతో ప్రసిద్ధి చెందిన ఇది గత ఏడాది అంబులెన్స్‌ను అడ్డుకున్నది. ఒక బైకర్‌ను గాయపర్చింది. 2022లో ఒక జీప్‌పై దాడి చేసింది. ఈ నేపథ్యంలో ‘కబాలి’ ఏనుగును అడవిలోకి తరమాలని స్థానికులు పలుమార్లు డిమాండ్ చేశారు. తాజాగా అది 18 గంటలపాటు రోడ్డును దిగ్బంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.




శుక్రవారం గాంధీనగర్ లో ఘనంగా ముఠా జై సింహా గారి జన్మదిన వేడుకలు జరిగాయి. గాంధీనగర్ డివిజన్ ఉపాధ్యక్షులు ఎస్ టి ఫ్రేమ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాకేష్ కుమార్, సంతోష్ ఆకుల ఆకుల శ్రీనివాస మొదలగువారు పాల్గొన్నారు

